రైతుబంధుపై కాంగ్రెస్ డ్రామా

మొదటిపేజీ తరువాయి...

ప్రయత్నం చేసేవారు కాదని అన్నారు. రైతుబంధు అనుమతిని ఉపసంహరించుకోవాలని పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని తెలిపారు. రైతుల అకౌంట్లలో రైతుబంధు పడే సమయంలో రైతుల నోట్లో కాంగ్రెస్ మట్టికొట్టిందని మండిపడ్డారు. దొంగే దొంగా దొంగా అని అరిచినట్టు ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ కొత్త డ్రామాలు మొదలు పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ తీరు..'వంద ఎలుకలు తిన్న పిల్లి నేను శాఖాహారిని' అన్నట్టు ఉన్నదని చెప్పారు. మాజీ పీసీసీ అధ్యక్షుడేమో రైతుబంధు దుబారా అంటున్నారని, ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడేమో రైతుబంధు బిచ్చమేస్తున్నడని అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు.

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కరోనాలోనూ రైతుబంధు ఇచ్చాం

సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని, అందుకే దేశంలోనే తొలిసారిగా రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. దేశంలో ఎంతోమంది ప్రధానులు, సీఎంలు ఉన్నారని, కానీ ఎవరైనా రైతులకు ఒక్కరూపాయి ఇచ్చారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కూడా రైతేనని, అందుకే కరోనావంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు బంద్‌పెట్టి మరీ రైతుంబధు పైసలు ఇచ్చామని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు రైతులంటే ఎప్పుడూ గిట్టదని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు ఉచిత కరెంట్‌ను ఉత్త కరెంట్ చేసిందని మండిపడ్డారు. ఎరువులు దొరకక రైతులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతమని చెప్పారు. నకిలీ విత్తనాలతో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. పగటి పూట 9 గంటల కరెంట్ ఇస్తామని 2009లో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పెట్టిందని, కానీ ఆ తర్వాత ఆ మాటను మరిచిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో చెరువులను పట్టించుకున్నది లేదని, చెక్‌డ్యామ్‌లు కట్టింది లేదని, ప్రాజెక్టులు పూర్తి చేసిందిలేదని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో రైతులను రాచి రంపాన పెట్టిందని గుర్తుచేశారు.

> కర్ణాటకలో యువతను మోసగించినట్టే తెలంగాణలోనూ మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తున్నది. రాహుల్‌గాంధీ చిక్కడపల్లిలో నిరుద్యోగులతో మీటింగ్ పెట్టారు. ఆయన మీటింగ్ పెట్టాల్సింది ఇక్కడ కాదు.. బెంగళూరులో పెట్టాలి. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క ఉద్యోగం కూడా ఎందుకు ఇవ్వలేదో దమ్ముంటే అక్కడి నిరుద్యోగ యువతకు సమాధానం చెప్పాలి.
>
> -మంత్రి హరీశ్‌రావు

వారసత్వాన్ని కొనసాగిస్తున్న రేవంత్

ఒకప్పుడు వ్యవసాయం దండగ అన్న నాయకుడికి ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వారసుడని, అందుకే ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్నాడని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటల కరెంటే చాలని, కావాలంటే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెప్తున్నాడని మండిపడ్డారు. రైతుబంధు బిచ్చమంటూ రైతులను అవమానిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. 50 ఏండ్ల పాలనలో రైతుల బాధలను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు కొత్తగా రైతులపై ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నదని మండిపడ్డారు.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, అందుకే.. నియోజకవర్గాల్లో బాండ్లు రాసిస్తున్నదని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గతంలో ఒకాయన పసుపుబోర్డు తెస్తానని ఇట్లనే బాండ్లు రాసిచ్చారని, అట్లనే ఇప్పుడు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మీద బాండ్లు రాసి స్తున్నదని ఎద్దేవా చేశారు. కర్ణాటకలోనూ బాండ్లు రాసిచ్చారని, ఐదు గ్యారెంటీలని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఊదరగొట్టారని.. ఆ తర్వాత ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతుందని, కానీ ఆ గ్యారెంటీల ఊసేలేదని చెప్పారు. కరెంట్ కోతలు, స్కాలర్‌షిప్‌లో కోతలు, రైతుబంధు రద్దు.. ఇవీ కర్ణాటకలో కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారెంటీలని ఎద్దేవా చేశారు. కర్ణాటక రైతుల పరిస్థితి పెనం మీదనుంచి పొయ్యిలో పడినట్టు అయ్యిందని అన్నారు. గతంలో 9 గంటల కరెంట్ వస్తే, ఇప్పుడు 5 గంటల కరెంట్ కూడా రావడం లేదని చెప్పారు. ఎంబీబీఎస్, పీజీ, లా చదువుకునే పిల్లలకు స్కాలర్‌షిప్‌లో 80 శాతం కోత విధించారని పేర్కొన్నారు. యువశక్తిని అమలు చేస్తామని హామీ ఇచ్చారని, 100 రోజుల్లో 2 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని రాహుల్‌గాంధీనే స్వయంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆరునెలల్లో ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా? ఇస్తే అతని పేరు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం ఒక నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని చెప్పారు.

రెండు జాతీయ పార్టీలు కుమ్మక్కు

తెలంగాణలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటినుంచి రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నడైనా బీజేపీని, నరేంద్ర మోదీని పల్లెత్తు మాటైనా అన్నారా? అని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రెండు జాతీయ పార్టీలు కుమ్మక్కై తెలంగాణ ఆత్మగౌరవం మీద దాడిచేసే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయకుండా రైతులను మోసం చేసింది కాంగ్రెస్, బీజేపీలేనని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ రైతు వ్యతిరేక పార్టీలేనని దుయ్యబట్టారు. బోరు బాయిలకాడ మీటర్లు పెట్టాలని బీజేపీ చెప్తే.. మీటర్లు పెట్టి పైసలు తెచ్చుకొన్నది కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్‌లో మోటర్లకు మీటర్లు పెట్టారని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కర్ణాటకలోనూ బోరుబాయిల కాడ మీటర్లు పెడతామని అసెంబ్లీలో బిల్ పాస్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. మరి రేపు ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణలో బోరు బాయిలకాడ మీటర్లు పెట్టదంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. తెలంగాణ రైతుల్లారా? తస్మాత్ జాగ్రత్త.. అని హెచ్చరించారు.

> తెలంగాణలో బాయిలకాడ మీటర్లు పెట్టనని సీఎం కేసీఆర్ చెప్పారని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామనే అన్నారు. దేశంలో తెలంగాణ తప్ప అన్ని రాష్ర్టాల్లో బాయిలకాడ మీటర్లు పెట్టారని చెప్పారు. అందుకే తెలంగాణకు పైసలు ఆపిన అని అమ్మగారు ఉన్నమాట చెప్పారు. అప్పటిదాకా బీజేపీ వాళ్లు కూడా ఎగిరెగిరి పడ్డరు. మేమెక్కడ మోటర్లకు మీటర్లు పెట్టమన్నం. మేం అట్ల చెప్పినట్టు చూపిస్తే ముక్కు నేలకు రాస్తనని చెప్పిండో బీజేపీ నాయకుడు. రాజకీయ సన్యాసం తీసుకుంటనని చెప్పిండు ఇంకో బీజేపీ నాయకుడు. మరి.. ఇప్పుడు ఆ బీజేపీ వాళ్లంతా తలకాయలు ఎక్కడ పెట్టుకుంటరో.
>
> -మంత్రి హరీశ్‌రావు

కల్లబొల్లి మాటలు నమ్మదు!

గత ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గడ్డమే గీయనని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారని, కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని రేవంత్ చెప్పాడని, మరి అవన్నీ ఏమయ్యాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమాల గడ్డ అని.. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలను, అబద్ధపు బాండు పేపర్లను ఇక్కడి ప్రజలు నమ్మరని చెప్పారు. 30న ఓటు వేసేందుకు లైన్లలో నిలబడినప్పుడు ప్రజలు అన్నీ గుర్తుకు తెచ్చుకోవాలని, ఓటుతోనే కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. 80 సీట్లలో బీఆర్‌ఎస్ గెలిచేది ఖాయమని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో గెలవగానే రైతులకు సాయం రద్దు

కర్ణాటకలో కాంగ్రెస్ గెలవగానే రైతులకు సాయాన్ని రద్దు చేసిందని మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో సాయం కింద 4 వేలు ఇచ్చేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దాన్ని ఊడగొట్టారని చెప్పారు. తెలంగాణలో కూడా అదే కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. రైతుకు రైతుబంధు దక్కొద్దనేదే కాంగ్రెస్ పాలసీ అని పేర్కొన్నారు. కర్ణాటకలో హామీలన్నీ ఏమయ్యాయని హైదరాబాద్‌లో మీడియా అడిగితే.. ఎన్నికలప్పుడు చాలా చెప్తామని, అన్నీ అమలు చేయడం సాధ్యమా? అని అక్కడి సీఎం సిద్ధరామయ్యనే ఒప్పుకొన్నారని గుర్తు చేశారు. 'ఓడ దాటేదాక ఓడ మల్లయ్య.. ఓడ దాటిన తర్వాత బోడ మల్లయ్య' అనేది కాంగ్రెస్ పార్టీ విధానమని సిద్ధరామయ్యనే ఒప్పుకొన్నారని తెలిపారు. కర్ణాటకలోలాగే తెలంగాణ ప్రజలను కూడా మోసగించాలని కాంగ్రెస్ చూస్తున్నదని చెప్పారు.

రేవంత్ అబద్ధాలకోరు..

రేవంత్ అబద్ధాల కోరు అని, రైతుబంధుపై దగాకోరు మాటలు మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పక్ష నేత కే కేశవరావు మండిపడ్డారు. హరీశ్‌రావును తాను తప్పుబట్టానని రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతుబంధుకు అనుమతి ఇవ్వడంపై హరీశ్‌రావు సంతోషం వ్యక్తం చేశారని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. భరత్‌కుమార్‌తో కలిసి తాను రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిశానని, హరీశ్‌రావు మాట్లాడిన విషయాన్ని వివరించామని చెప్పారు. ఎన్నికల అధికారి సైతం తాము చెప్పిన దానితో ఏకీభవించారని తెలిపారు. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించేందుకు ప్రయత్నించామని, కానీ సెలవు కావడంతో అందుబాటులోకి రాలేదని తెలిపారు.

రైతుబంధు నిలిపివేత

III పేజీ తరువాయి...

ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు ఎన్నికల సంఘం రెండు రోజుల క్రితం రైతుబంధుకు అనుమతినిచ్చింది. రైతుబంధు పంపిణీకి అభ్యంతరం లేదంటూ ఈ నెల 25న రాష్ట్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాసింది. అయితే ఇంతలోనే సోమవారం ఒక ప్రకటన జారీ చేస్తూ రైతుబంధును నిలిపివేయాలని ఆదేశించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నియమాలను ఉల్లంఘించారని పేర్కొంటూ రైతుబంధు పంపిణీని నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అయితే కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకే ఎన్నికల సంఘం రైతుబంధు పథకాన్ని నిలిపివేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. పంట రుణాలమాఫీ, రైతుబంధు వంటి .. లబ్ధిదారులకు ప్రత్యక్షంగా జరుగుతున్న నగదు పంపిణీ పథకాలను నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఇదివరకే ఎన్నికల సంఘానికి విజ్ఞప్తిచేసింది. ఆ మేరకే ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నదని సామాజిక మాధ్యమాల్లో పలువురు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈసీ నిర్ణయంపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు విస్మయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులే రైతుబంధు ఆపారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా రైతుల కోణంలో ఆలోచించి రైతుబంధుకు పంపిణీకి అనుమతిని పునరుద్ధరించాలని బీఆర్‌ఎస్ ఎన్నికల సంఘాన్ని కోరింది.

రైతుబంధు ఆపొద్దు!

రైతులకు పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు పథకం అమలుకు అనుమతించాలని బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల సంఘానికి విజ్ఞప్తిచేసింది. రైతుల ఖాతాల్లో నిధులు జమచేయడానికి అనుమతి ఇచ్చిన తరువాత నిలిపివేయాలని నిర్ణయించడం సరికాదని తెలిపింది. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా రైతుల కోణంలో ఆలోచించి అనుమతిని పునరుద్ధరించాలని కోరింది. ఈ మేరకు బీఆర్‌కేఆర్ భవన్‌లో సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు, ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్, సీఎల్పీ కార్యదర్శి కే రమేశ్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కేశవరావు మీడియాతో మాట్లాడుతూ.. రైతుబంధు అంశం పార్టీలకు సంబంధించినది కాదని, రైతులకు అందించే సాయమని, దీనికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. రైతుబంధుకు అనుమతి ఇచ్చి, ఇప్పుడు వెనక్కు తీసుకోవడంతో నాలుగు కోట్ల మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముందు అనుమతి ఇచ్చి, ఆ తరువాత కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా ఎలా నిలిపివేస్తారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ స్కీం ద్వారా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడానికి మాత్రం ఎన్నికల సంఘం అనుమతించిందని గుర్తుచేశారు. దానికి అనుమతించిన ఎన్నికల సంఘం రైతుబంధును ఎలా నిలిపివేస్తారని నిలదీశారు. రైతుబంధు 2018, మే నెల నుంచి కొనసాగుతున్న పథకమని, దీనిని రాజకీయం చేయడం సహేతుకం కాదని అన్నారు. యాసంగి సాగు మొదలైనందున వారికి పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.5వేల చొప్పున ప్రభుత్వం ఈ నెల 24 నుంచి రైతుబంధు అమలు చేయాలని నిర్ణయించిందని, దీనికి ఎన్నికల సంఘం కూడా అనుమతించిందని గుర్తుచేశారు. ఇంతలోనే రైతుబంధు నిలిపివేయాలని ఎన్నికల సంఘం సోమవారం ఇచ్చిన ఆదేశాలు తమను ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల్లో పేర్కొన్నట్టుగా మంత్రి హరీశ్‌రావు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని కేశవరావు వివరించారు. రైతుబంధును పంపిణీ చేయడానికి అనుమతి ఇచ్చినందుకు కేవలం ధన్యవాదాలు తెలిపారని అన్నారు. రైతుబంధును నిలిపివేయడం ద్వారా రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, పంట కాలం నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం తన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌కు రైతుల శాపం తప్పదు

రైతుబంధు కోసం రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతుబంధుకు ఎన్నికల సంఘం క్లియరెన్స్ ఇవ్వగానే అన్నదాతలు ఎంతో ఆనంద పడ్డారు. రైతుబంధు పైసలు వస్తే.. ఇక వ్యవసాయ పనులు ప్రారంభించుకోవచ్చని ఆశ పడ్డారు. కానీ, రైతులు సంతోషంగా ఉండటం కాంగ్రెస్ వాళ్లకు నచ్చలేదు. రైతులు బీఆర్‌ఎస్ పక్షాన ఉంటారేమో అని, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ ఎన్ని డ్రామాలు ఆడినా నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. కాంగ్రెస్ పార్టీకి రైతుల శాపం తగలక మానదు.

- వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు

రైతుబంధును మళ్లీ ఆపిన కాంగ్రెస్

రైతులకు పెట్టుబడి సాయం అందకుండా కుట్ర • రైతుల నోటికాడి ముద్దను లాగేసిన హస్తంపార్టీ

తెల్లారితే డబ్బులు పడతాయనగా ఈసీకి ఫిర్యాదు

ఈసీకి లేఖ రాసిన ఆ పార్టీ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్

- రైతులకు రైతుబంధు ఇవ్వకుండా ఆపాలని ఫిర్యాదు
- కాంగ్రెస్ ఫిర్యాదుపై స్పందించి ఆపేసిన ఎన్నికల సంఘం
- శుక్రవారం ఇచ్చిన అనుమతి సోమవారం రద్దు
- గత నెలలోనూ రైతుబంధుపై కాంగ్రెస్ ఫిర్యాదు
- ఈసీ ఆపినా ఒప్పించి అనుమతి తెచ్చిన బీఆర్‌ఎస్
- పెట్టుబడి సాయం అందించేందుకు ఏర్పాట్లు పూర్తి
- సాయం అందే కొన్ని గంటల ముందు మళ్లీ ఫిర్యాదు
- కేసీఆర్ కష్టాన్ని బూడిదపాలు చేసిన కాంగ్రెస్ పార్టీ
- కేంద్రప్రభుత్వ పీఎం కిసాన్‌పై మాత్రం మౌనం
- రైతన్నా.. తస్మాత్ జాగ్రత్త.. ఆలోచించి అడుగెయ్

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ లక్ష్యం నెరవేరింది. రైతులకు రైతుబంధు రాకుండా చేయాలన్న కుట్రలో పూర్తిగా సఫలమైంది. కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులపై ఫిర్యాదు చేసి రైతుబంధును అడ్డుకోవడంలో విజయం సాధించింది. రైతుల నోట్లో మట్టికొట్టి కాంగ్రెస్ నేతలు సంబురాలు చేసుకొంటున్నారు. తెల్లారితే రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం జమవుతుందనగా నోటికాడి బుక్కను కాంగ్రెస్ లాగేసింది. రైతుబంధును ఆపేయాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొన్న ఈసీ, ఈ నెల 24న ఇచ్చిన అనుమతిని రెండు రోజులు తిరక్కుండానే 26న రద్దుచేసింది. రైతుబంధులాగే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పీఎం కిసాన్ పథకంపై మాత్రం కాంగ్రెస్ పార్టీ గప్‌చుప్‌గా ఉన్నది.

బీఆర్‌ఎస్ కష్టమంతా నేలపాలు

రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకొచ్చింది. పెట్టుబడి అందటం ఆలస్యమైతే పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఈసీకి వివరించి, ఒప్పించింది. దీంతో ఈ నెల 28వ తేదీ వరకు రైతుబంధు పంపిణీ చేయవచ్చని 24న ఈసీ అనుమతిచ్చింది. అయితే ఆ తర్వాత వరుసగా మూడు రోజుల పాటు బ్యాంకులకు సెలవులు వచ్చాయి. దీంతో 28వ తేదీన పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇక్కడే కాంగ్రెస్ నేతలు మళ్లీ కుట్రలకు తెరలేపారు. రైతుబంధును ఆపాలని మరోసారి ఈసీకి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొన్న ఈసీ మరికొన్ని గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయనగా ఆపేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వార్త విన్న వెంటనే కాంగ్రెస్ పార్టీ నేతలు సంతోషంలో చిందులేస్తున్నారు. పెట్టుబడి సాయంపై పుట్టెడు ఆశలు పెట్టుకున్న రైతులు మాత్రం తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు.

పీఎం కిసాన్‌పై కాంగ్రెస్ గప్‌చుప్

> రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యగల లోపాయికారి ఒప్పందం బట్టబయలైంది. రైతుబంధు పంపిణీపై నానా యాగి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. అదే సమయంలో కేంద్రం ఇస్తున్న పీఎం కిసాన్‌పై మాత్రం కిక్కురుమనడం లేదు. నవంబర్ 15వ తేదీన రాష్ట్రంలోని రైతులకు పీఎం కిసాన్ కింద రూ. 2 వేల సాయం జమ చేసింది. దీనిపై కాంగ్రెస్ ఎక్కడా ఎవరికీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. కానీ రైతుబంధుపై మాత్రం ఫిర్యాదులపై ఫిర్యాదులను చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీఎం కిసాన్ పంపిణీకి అభ్యంతరం వ్యక్తం చేయని కాంగ్రెస్ పార్టీ రైతుబంధు పంపిణీపై ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

అక్టోబర్ 23: ఈసీకి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే లేఖ. రైతుబంధును ఆపేయాలని ఫిర్యాదు.

అక్టోబర్ 26: రైతుబంధు దుబారా అని ప్రకటించిన మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.

నవంబర్ 24: రైతులకు రైతుబంధు సకాలంలో అందివ్వటం ఎంత ముఖ్యమో వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మూడుసార్లు లేఖలు రాయటంతో రైతుబంధు పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి.

నవంబర్ 26: రైతుబంధు ఆపాలంటూ ఈసీకి మరోసారి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్. ఎన్నికల సంఘానికి పీసీసీ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ లేఖ.

నవంబర్ 27: నిరంజన్ ఫిర్యాదుపై స్పందించి రైతుబంధును ఆపేసిన ఈసీ.

నవంబర్ 28: రైతుబంధు పంపిణీకి అన్నీ సిద్ధం చేసిన రాష్ట్రప్రభుత్వం. 28న రైతుల ఖాతాల్లోకి డబ్బు జమచేయాలని నిర్ణయం.

కాంగ్రెస్ ఫిర్యాదుల మీద ఫిర్యాదులు

రైతుబంధు పథకంపై కాంగ్రెస్ పార్టీ తొలినుంచీ వ్యతిరేకంగానే ఉన్నది. ఈ పథకాన్ని ఆపడమే లక్ష్యంగా కుట్రలు చేసింది. ఇందుకోసం అవకాశం ఉన్న ప్రతిచోట మళ్లీమళ్లీ ఫిర్యాదులు చేసింది. తొలుత కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే స్వయంగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రైతుబంధుపై ఫిర్యాదు చేశారు. రైతుబంధు ఆపేయాలని, రైతులకు పెట్టుబడి సాయం అందకుండా చూడాలని కోరారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ కృషితో తిరిగి రైతుబంధు పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. అంతే... కాంగ్రెస్ పార్టీకి నిద్రకూడా పట్టినట్టు లేదు. రైతులకు ఏ విధంగా రైతుబంధు వస్తదో చూస్తమని పంతం పెట్టుకున్నది. రైతుబంధును అడ్డుకునేందుకు మళ్లీ ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ ఆదివారం ఈసీకి ఫిర్యాదు చేశారు. రైతుబంధు వల్ల ఎన్నికలు ప్రభావితమవుతాయని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం రైతుబంధు పంపిణీకి ఇచ్చిన అనుమతిని హఠాత్తుగా రద్దు చేసింది. కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టి రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు బీఆర్‌ఎస్ విశ్వ ప్రయత్నాలు చేసింది. కాంగ్రెస్ ఫిర్యాదుపై ఈసీ ఎన్నిమార్లు ప్రశ్నలు అడిగినా రాష్ట్ర ప్రభుత్వం ఓపిగ్గా సమాధానాలు ఇచ్చింది. రైతులకు రైతుబంధు అవసరాన్ని వివరించింది. చివరికి రైతుబంధు పంపిణీకి అనుమతి ఇచ్చేలా ఒప్పించింది. ఇక రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేద్దామని ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో కాంగ్రెస్ మరోసారి సైంధవుడి పాత్ర పోషించింది.

రైతన్నా... తస్మాత్ జాగ్రత్త

ఎన్నికల వేళ రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రైతులకు మేలు చేసే పార్టీ ఏదో, కీడు చేసే పార్టీ ఏదో గమనించుకోవాలని సూచిస్తున్నారు. అలా కాకుండా గుడ్డిగా, ఎవరో చెప్పింది నమ్మి అడ్డదిడ్డంగా ఓటేస్తే మాత్రం కష్టాలు పడక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇందుకు రైతుబంధును ఉదాహరణగా చూపుతున్నారు. రైతుబంధు సాయం రైతులకు ఎంత ముఖ్యమైందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటి పథకంపైనా కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు చేసింది. రైతుల కష్టనష్టాలతో పట్టింపు లేకుండా రాజకీయ స్వలాభం కోసం నీచంగా వ్యవహరించింది. అదే సమయంలో బీఆర్‌ఎస్ మాత్రం రైతులకు మేలు చేసేలా ప్రయత్నాలు చేసింది. ఈ నేపథ్యంలో తమకు ఏ పార్టీ అండగా ఉంటుందో గుర్తెరిగి ముందుకు సాగాలని రాజకీయ విశ్లేషకులు రైతులకు సూచిస్తున్నారు.

నిజామాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

నోటికాడి బుక్కను లాక్కున్న కాంగ్రెస్

- రైతు వ్యతిరేకతను చాటుకున్న హస్తం పార్టీ
- రైతుబంధు కావాలా.. రాబందుకావాలా?
- తేల్చుకోవాల్సిన సమయమిదే: కవిత

ఖలీల్‌వాడీ, నవంబర్ 27: రైతుబంధును నిలిపివేయించిన కాంగ్రెస్ రైతుల నోటికాడి బుక్కను లాక్కున్నదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజామాబాద్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు ఎప్పటినుంచో అమలులో ఉన్న పథకమని, ఇప్పటికి 11 సీజన్లు ఇచ్చాం. ఈ పథకం కింద 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.72 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జమచేసిందని చెప్పారు. రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్న రైతుబంధు పథకాన్ని, రుణ మాఫీని నిలిపివేయించడం ద్వారా కాంగ్రెస్ తన రైతు వ్యతిరేకతను చాటుకున్నదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీకి పదే పదే ఫిర్యాదులు చేస్తూ ఆపేయించారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

మిడతల దండు పనిపట్టాలి

పంటలు చేతికొచ్చే సమయంలో మిడతల దండు వచ్చి పడ్డట్టు.. ఐదారు రోజులుగా ప్రధాని, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు వచ్చి తెలంగాణ మీద పడ్డారని కవిత విమర్శించారు. తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో రాహుల్, ప్రియాంక ఎక్కడున్నారని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ నాయకులు ఆంధ్ర హక్కులపై మాట్లాడారు తప్ప తెలంగాణ గురించి మాట్లాడలేదని తెలిపారు. పార్లమెంట్‌లో పెదవి విప్పని నాయకులు, అవసరమున్నప్పుడు తెలంగాణకు నయాపైసా ఇవ్వని వాళ్లు మనకు అవసరమా అన్నది ప్రజలు ఆలోచించాలని కోరారు. రైతుబంధు కావాలా.. లేదా రాబందు కావాలా? ఇరిగేషన్ కావాలా.. లేదా మైగ్రేషన్ కావాలా? అన్నది తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని అన్నారు. సీఎం కేసీఆర్‌పై అభాండాలు వేస్తూ పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తూ దండయాత్రకు వచ్చిన మిడతల దండు పని పట్టాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.

రైతుబంధు బీఆర్‌ఎస్.. రాబందు కాంగ్రెస్

- దేశానికి అన్నంపెట్టే రైతన్న పొట్టగొడితే పుట్టగతులుండవ్..
- రైతు నోటికాడ బువ్వను లాగేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తాం
- సోషల్ మీడియాలో కాంగ్రెస్ తీరుపై భగ్గుమన్న నెటిజన్లు

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రైతుబంధు పైసలు ఇవ్వొద్దంటూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం.. ఎన్నికల సంఘం రైతుబంధును ఆపాలని ఆదేశాలివ్వడంపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది. రైతు నోటికాడ బువ్వను లాగేసిన కాంగ్రెస్ తీరుపై ప్రాంతాలకు అతీతంగా నిరసన వ్యక్తమవుతున్నది. ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక వేదికలపై కాంగ్రెస్ తీరును నెటిజన్లు కడిగిపారేస్తున్నారు. 50 ఏండ్లకుపైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ రైతులకు ఏమీ చేయలేదని, ఇప్పుడు బీఆర్‌ఎస్ రైతుల కోసం మంచి చేస్తుంటే చూడలేకపోతుందని మండిపడుతున్నారు.

పీఎం కిసాన్‌కు కోడ్ ఉండదా?

'రైతుబంధును ఆపిన దుర్మార్గమైన పార్టీ కాంగ్రెస్.. రైతు వ్యతిరేక కాంగ్రెస్ నాయకులు ప్రచారానికి వస్తే గ్రామాల్లో అడుగు పెట్టనివ్వకండి.. మీ పవర్ ఏమిటో చూపించండి' అంటూ సోషల్ మీడియాలో పిలుపునిస్తున్నారు. రాబందు కాంగ్రెస్ కావాలా? రైతుబంధు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా? అని ఒక యువకుడు ట్వీట్ చేయగా.. కాంగ్రెస్‌ను కాటికి పంపుదాం.. బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందాం.. అని అనేక మంది రీట్వీట్ చేశారు. పీఎం కిసాన్‌కు ఎన్నికల కోడ్ లేదని, మరి రైతుబంధుకు మాత్రం ఎందుకు అడ్డొస్తుందని నిలదీశారు. రైతుబంధును అడ్డుకోవడానికి అనేకసార్లు ఈసీకి ఫిర్యాదులు చేసిన కాంగ్రెస్ పార్టీ.. పీఎం కిసాన్‌పై మాత్రం ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రైతులపై కాంగ్రెస్, బీజేపీ ఇద్దరిదీ దొంగ ప్రేమేనని మండిపడ్డారు. రైతు నోటికాడ బువ్వను లాగేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తామని, రైతుబాంధవుడు కేసీఆర్‌కు అండగా నిలుద్దామని పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించారు.

రైతుల పాలిట రాబందురెడ్డి

- రైతుల నోట్లో మన్ను కొట్టిన కాంగ్రెస్
- ఆ పార్టీని ఎక్కడికక్కడే నిలదీయాలి
- బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఇన్నాళ్లు రేటెంతరెడ్డిగా ఉన్న రేవంత్.. ఇక నుంచి రైతుల పాలిట రాబందురెడ్డిగా మారాడని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతుబంధు సాయాన్ని నిలిపివేయించి రైతుల నోట్లో మట్టికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయి రైతుబంధుని నిలిపివేశాయని, తెలంగాణ ప్రజలు ఆ పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. రైతుబంధు వస్తే రేవంత్ ఎందుకు కండ్లలో నిప్పులు పోసుకుంటున్నారు? రైతులు చల్లగా ఉంటే ఆయనకు ఎందుకు కడుపుమంట? అని ప్రశ్నించారు. తాజాగా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ కూడా రైతుబంధుపై ఫిర్యాదు చేయబట్టే.. సాయాన్ని నిలిపివేశారని, చిల్లర రాజకీయాల కోసం కాంగ్రెస్ లక్షల మంది రైతుల జీవితాలతో చెలగాటమాడటం అన్యాయమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రైతుబంధు సొమ్ము పంపిణీని కాంగ్రెస్ నేతలు ఎలా అడ్డుకున్నారో ఆధారాలతో సహా ఆయన మీడియాకు చూపించారు. రైతుబంధుని నిలిపివేయించిన రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ నేతలను ప్రజలు, రైతులు ఎక్కడికక్కడే గల్లాపట్టి నిలదీయాలని పిలుపునిచ్చారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము నరేందర్

రైతులంటే కండ్లమంట



రైతులంటే కాంగ్రెస్‌కు మొదటి నుంచి కండ్ల మంటనే. అదే విషయం మరోసారి రుజువైంది. రైతుబంధు ఎప్పుడో పడాల్సి ఉన్నా.. మొదట్లోనే దానికి కాంగ్రెస్ అడ్డుకట్ట వేసింది. ఢిల్లీకి వెళ్లి మరీ ఫిర్యాదు చేసి రైతుబంధును అడ్డుకున్నది. నోటికాడిబుక్కను దూరం చేసిన కాంగ్రెస్‌కు రైతులు ఓటుతో బుద్ధిచెప్పాలి.

- మేడె రాజీవ్‌సాగర్, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్